

మహా రథోత్సవంలో జన సందోహం



ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు

- వైభవంగా రాఘవేంద్రుడి మహా రథోత్సవం
- భక్తులతో పులకరించిన తుంగా తీరం
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న నృత్యాలు
- రథోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు



బృందావనానికి హారతులు ఇస్తున్న పీఠాధిపతి

బృందలోలుడి బ్రహ్మరథం

తుంగాతీరం ఆధ్యాత్మికతతో ఉప్పొంగింది. ఇష్టదైవం రాఘవేంద్రుడి వైభవాన్ని చూసి భక్తులు పరవశించిపోయారు. ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం భక్తజనసంద్రమైంది. గుండెల నిండా భక్తి నింపుకుని దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. 'మూలరామా విజయథే.. తుంగా తీరా నివాసా గోవిందా గోవిందా.. జయహో గురు రాఘవేంద్ర విజయహో పూజ్యాయ రాఘవేంద్రాయ నమో నమః' అంటూ భక్తుల రాఘవరాయల నామస్మరణతో శ్రీమఠం మారుమోగింది. రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాల్లో ఐదవ రోజు అత్యంత ముఖ్యమైన ఉత్తరాధనలో భాగంగా గురువారం మహా రథోత్సవం వైభవంగా సాగింది.



మంత్రాలయం, ఆగస్టు 22: జగద్గురు రాఘవేంద్రస్వామి సప్తరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం ఉత్తరాధన పురస్కరించుకుని మహా రథోత్సవం కన్నులపండువగా జరిగింది. శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఉదయం సుప్రభాత సేవతో ఉత్సవాలకు అంకురార్పన పలికారు. వజ్ర వైడూర్య రత్నాలతో పొదిగిన హారం, బంగారు ఆభరణాలతో అలంకృతుడైన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను సంస్కృత పాఠశాల వరకు ఊరేగించి తిరిగి శ్రీమఠానికి తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవమూర్తికి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు పూజలు చేసి మహామంగళహారతులు ఇచ్చారు. వసంతోత్సవంలో భాగంగా మఠం అర్చకులు, సిబ్బంది, భక్తులపై రంగులు చల్లుతూ ఉత్సాహంగా ముందుకు సాగారు. ఉత్సవమూర్తిని రథంపైకి అధిష్టిస్తుండగా.. లక్షలాది మంది భక్తులు జయహో గురు రాఘవేంద్ర.. విజయహో అంటూ పెద్ద ఎత్తున జయధ్వానాలు పలికారు. మహారథంపై నుంచి భక్తులకు పీఠాధిపతి అభివాదం చేశారు. శ్రీమఠం మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్ నుంచి మహారథం ముందుకు సాగుతుండగా చండీవాయిద్యాలు, నాదాహారం, కోలాట నృత్యాలు, బీరప్పడోలు, భజన మండల భక్తి పాటలు, మంగళవాయిద్యాలు, దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. రాఘవేంద్ర సర్కిల్ వద్ద యువత బాణాసంచా పేలుస్తూ నృత్యాలు చేశారు. అనంతరం శ్రీమఠానికి చేరుకున్న మహారథం నుంచి ఉత్సవమూర్తిని బృందావనం ముందు ఉంచి పూజలు చేశారు. ఈ ఉత్సవంలో పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, మఠం దివాన్ సుజీంద్రాచార్, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, శ్రీమఠం ఉత్తర భారతదేశ విచారణ కర్త శ్రీనివాస్ కస్బే, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈలు బద్రినాథ్, శ్రీహరి, వ్యాసరాజాచార్, బిందు మాధవ్, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, రవి కులకర్ణి, జేపీ స్వామి, విజయేంద్రాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ ఆచార్, జయతీర్థాచార్, వాధిరాజాచార్‌లు పాల్గొన్నారు.

హిందువులపై దాడి హేయం

పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు చేయడం అమానుషమని, దీనిని ప్రతి భారతీయుడు ఖండించాల్సిన అవసరం ఉందని పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు అన్నారు. మహారథంపై నుంచి ఆయన దివ్య సందేశాన్ని భక్తులకు వినిపించారు. రాఘవేంద్రస్వామి సజీవంగా యోగనిద్రలో ఉంటూ భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ఉన్నారన్నారు. స్వామివారు బృందావనం నుంచి భక్తుల యోగ క్షేమాలు తెలుసుకుంటూ వారి ప్రతి కోరికను తీరుస్తారన్నారు. దేశంలో ప్రజలంతా శాంతితో ఐకమత్యంతో ఉండాలని కోరారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులు సస్యశ్యామలంగా ఉండాలన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశాన్ని, రాష్ట్రాంతో పాటు ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేయాలని పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలిరావడం చూస్తుంటే.. ప్రతి ఇంటా ఆరాధ్య దైవంగా రాఘవేంద్రుడు కొలువై ఉన్నారని రుజువైందని అన్నారు. ఎంతో మంది దాతలు, భక్తులు ఇచ్చిన సహకారంత ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో పీఠాధిపతి ప్రసంగిస్తుండగా భక్తులు శ్రద్ధగా ఆలకించారు. ఇదిలా ఉండగా శ్రీమఠం ఉద్యోగులకు 22వ పీఆర్‌సీ, 2 డీఏలు ఇస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. కాంట్రాక్టు, ఎన్ఎంఆర్ సంభావన కింద పని చేసే వారికి రెండు నెలల జీతం పెంచుతున్నట్లు ప్రకటించారు. మంత్రాలయంలో డిగ్రీ, విశ్వవిద్యాలయం, ఇంజనీరింగ్ కాలేజీలు త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.



రథం ఎదుట కోలాహలం



భక్తులపై రంగులు చల్లి వసంతోత్సవం



అశ్వ విన్యాసం

రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు: రాఘవేంద్ర స్వామి మహారథోత్సవ వేడుకల్లో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర ఉదార్, మైసూరు మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్ తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు 325 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. యోగీంద్ర కళామండపంలో గురువారం రాత్రి బెంగుళూరు చెందిన ప్రభాత్ కళా బృందం నృత్యరూపకం, ధార్వాడకు చెందిన పండిత్ వెంకటేశ కుమార్ హిందుస్థాని వోకల్ సంగీతం భక్తులను అలరించింది.



రథోత్సవంలో కర్ణాటక కళాకారుల ప్రదర్శన



సంప్రదాయ వస్త్రధారణలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



రథంపై నుంచి పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆశీస్సులు

మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

కర్నూలు న్యూసిటీ/ ఆదోని టౌన్, ఆగస్టు 22: ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి అనిల్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న కె.రామచంద్రారెడ్డిని భీమవరానికి, గూడూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న దివాకర్‌రెడ్డిని రాయదుర్గానికి బదిలీ చేశారు. అదేవిధంగా ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ ఏవీ రమేష్‌బాబును కర్నూలు నగర పాలక సంస్థ సూపరింటెండెంట్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముమ్మడివరం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న కె. వెంకట్రామిరెడ్డిని ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అయితే ఆదోని, గూడూరు మున్సిపాలిటీలకు కమిషనర్లను నియమించలేదు. ఇదిలా ఉండగా ఆదోని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ఆరు నెలల్లోపే బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది.

వైసీపీతో పోరాడిన వారికే ప్రాధాన్యం

- నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి స్పష్టం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 22: వైసీపీ ప్రభుత్వంలో పోరాడి..ఇబ్బందులకు గురైన వారందరికీ న్యాయం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చిన్న బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అక్రమ కేసులకు, వేధింపులకు గురైన తెలుగు యువత సభ్యులకు ప్రాధాన్యత ఇచ్చి కార్పొరేషన్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చిన్న బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి రాక్షసపాలనను ఎదిరించి, తెలుగు యువత కార్యకర్తలు ప్రజలకు మనో ధైర్యాన్ని ఇచ్చి గత ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర నాయకులు పర్వీన్‌తాజ్, దొరస్వామి నాయుడు, వై.నాగేశ్వరరావు యాదవ్, నాయకులు గోపినాథ్, వంశీధర్‌రెడ్డి, సురేష్, ఎస్. అబ్బాస్, కే. నాగేంద్ర, గట్టు తిలక్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ఉచితం

- టన్నుకు రూ.326 లోడింగ్ చార్జీలు
- 5 డిసిల్టింగ్ పాయింట్ల నుంచి అందుబాటులో
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 22: జిల్లా ప్రజలకు ఇసుకను ఉచితంగా అందజేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా వెల్లడించారు. అయితే టన్ను ఇసుకకు లోడింగ్ చార్జీలుగా శుక్రవారం నుంచి రూ.326కు తగ్గించినట్లు ఆయన తెలిపారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయిఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధికారులతో బోట్‌మెన్ సొసైటీలు, ట్రాక్టర్, లారీ యజమాన్యాలు కూడా పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ జి. బిందుమాధవ్‌తో కలిసి కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం గుడికంబాలి స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను సరఫరా చేస్తున్నామన్నారు. గురువారం నుంచి సి.బెళగల్ మండలంలోని ఐదు డిసిల్టింగ్ పాయింట్ల ద్వారా ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. టన్ను ఇసుకను లోడింగ్ చార్జీలకు రూ.335 ఉండగా.. ప్రస్తుతం అందులో రూ.9 తగ్గించి టన్ను ఇసుక ధరను రూ.326గా నిర్ణయించామన్నారు. నిజానికి ఇసుకను ఉచితంగా ఇస్తున్నామని.. ఇసుక తవ్వకం, లోడింగ్, సీనరేజ్, జీఎస్టీలకు మాత్రమే రూ.326 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ట్రాన్స్‌పోర్టేషన్‌కు సంబంధించి 20 కి.మీల వరకు ట్రాక్టరుకు రూ.1,400, 6 టైర్లు ఉన్న లారీకి రూ.2వేలు, 10 టైర్లు ఉన్న లారీకి రూ.3,600, 12 టైర్లు ఉన్న లారీకి రూ.3,840, 16 టైర్లు ఉన్న లారీకి రూ.4,480గా ధర నిర్ణయించామన్నారు. 20 కి.మీలు పైన ప్రతి కిలో మీటరుకు రూ.8 చెల్లించాల్సి ఉంటుందన్నారు. త్వరలో మరో 3 ఓపెన్ రీచులను ప్రారంభిస్తామన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 18004256042కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇదిలా ఉండగా గత రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా పత్తికొండ, ఆస్పరి, హాలహర్వి, హొళగుంద, గోనగండ్ల తదితర 7 మండలాల్లో 4,500 హెక్టార్లలో పంట నష్టం జరిగిందన్నారు. పొలాల్లో ఉన్న నీరు తగ్గుముఖం పట్టిందని, పంట నష్టాన్ని పరిశీలించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, ఆర్డీవో శేషిరెడ్డి, ఆదోని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ చల్లా విశ్వనాథ్, గనుల శాఖ డీడీ రాజశేఖర్, డీటీసీ శ్రీధర్, సెబ్, పర్యావరణ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

గంజాయి, మత్తు నియంత్రణకు చర్యలు : ఎస్పీ బిందు మాధవ్

జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ వెల్లడించారు. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెట్టామని, ఇతర రాష్ట్రాల నుంచి బస్సులలో గంజాయి సరఫరా కాకుండా ర్యాండమ్‌గా బస్సులను చెక్ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

నిఘా విభాగంపై జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆగ్రహం



గైనిక్ విభాగంలో గర్భిణులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 22: కొత్తగా నిర్మించిన న్యూ డయోగ్నస్టిక్ బ్లాకులో స్టీల్ కొళాయిలు చోరీకి గురి కావడంపై కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. న్యూడయోగ్నస్టిక్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని బాత్‌రూమ్‌లో కొళాయిలు చోరీ కావడంపై మండిపడ్డారు. ఆసుపత్రిలో రోగుల సెల్‌ఫోన్లు, వార్డుల్లో విలువైన వస్తువులు పోతున్నాయని ప్రతి రోజు సూపరింటెండెంట్ కార్యాలయానికి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా సెక్యూరిటీ ఏజెన్సీ ఏం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఎక్స్‌పర్ట్ సెక్యూరిటీ ఏజెన్సీకి మెమో జారీ చేయాలని ఆర్ఎంవోను ఆదేశించారు. గర్భిణులు, రోగులకు అల్ట్రాసౌండ్ పరీక్షలు వేగవంతంగా నిర్వహించాలని రేడియాలజీ వైద్యులను ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట సీఎస్ఆర్ఎంఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ హేమనళిని, ఏఆర్ఎంఓ వెంకటరమణ, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి తదితరులు ఉన్నారు.

రేపు నగరంలో మారథాన్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 22: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ నెల 24న 5 కిలోమీటర్ల మారథాన్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ గురువారం తెలిపారు. 17 నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులు, రెడ్ రిబ్బన్ క్లబ్ సభ్యులు ఈ మారథాన్‌లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ నెల 24న ఉదయం 6 గంటలకు నంద్యాల చెక్‌పోస్టు వరకు పరుగు పందెం ఉంటుందన్నారు. పురుషులు, స్త్రీలు ట్రాన్స్‌జెండర్లకు మారథాన్ విడివిడిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన విజేతకు రూ.7వేలు, రెండో విజేతకు రూ.4వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తామన్నారు. అర్హులు 24వ తేదీ ఉదయం 5 గంటలకు నగరంలోని కోల్స్ కాలేజీ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని పోటీల్లో పాల్గొనాలన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 22: పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు ఉమ్మడి జిల్లాకు రూ.25.63 కోట్లు మంజూరైనట్లు జడ్పీ సీఈఓ జి. నాసర రెడ్డి తెలిపారు. గురువారం జడ్పీలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని 53 మండలాల పరిషత్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు ఆయన వివరించారు. జిల్లా పరిషత్‌కు బేసిక్ గ్రాంట్ రూ.5,12,38,547, టైడ్ గ్రాంట్ రూ.7,65,58,105 కలిపి మొత్తం రూ.12,80,96,652, అదే విధంగా మండల పరిషత్‌లకు బేసిక్ గ్రాంట్ రూ.5,12,87,973, టైడ్ గ్రాంట్ రూ.7,69,32,385 కలిపి మొత్తం రూ.12,82,20,358 విడుదల చేసినట్లు సీఈఓ తెలిపారు. బేసిక్ గ్రాంట్ నిధులు కేవలం గ్రామాల్లో పారిశుధ్యానికి, టైడ్ గ్రాంట్ నిధులు నిర్మాణాలు, మరమ్మత్తులకు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఖర్చు చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు.

ఐదు టిప్పర్లు సీజ్

కర్నూలు(అర్బన్), ఆగస్టు 22: అక్రమంగా ఖనిజాన్ని తరలిస్తున్న ఐదు టిప్పర్లు సీజ్ చేశామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం బనగానపల్లె నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న డోలమైట్ ఖనిజాన్ని ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీల్లో సీజ్ చేశారు. ఇతర అవసరాల కోసం గ్రావెల్, చిప్స్ తరలిస్తున్న మరో 3 లారీలను పాణ్యం, ఉల్లిందకొండ, కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 22: సెప్టెంబరు 5న గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో శామ్యూల్ గురువారం తెలిపారు. జిల్లాలో 15 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీలోపు మండల, డివిజన్ విద్యాశాఖ అధికారుల ద్వారా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 22: నంద్యాల మండలం రాయమాల్‌పురం గ్రామ సమీపంలో బుధవారం కుందూ నదిలో గల్లంతైన బాలుడి మృతదేహం లభించిందని తాలూకా అర్బన్ సీఐ అసార్ బాషా గురువారం తెలిపారు. రాయమాల్‌పురం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కుందూ నదిలో బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో రాయమాల్‌పురం గ్రామానికి చెందిన షేక్షావలి(15), ప్రమాదవశాత్తు కుందూలో గల్లంతు కావడంతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం గల్లంతైన బాలుడి మృతదేహం లభించింది. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాల మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు సీఐ తెలిపారు.

అడవి పందుల వేటగాళ్ల వల్లే విద్యుత్ కోతలు

ఆత్మకూరు విద్యుత్ ఏడీ రమేష్



సింగరాజుపల్లి గ్రామ శివారులో విద్యుత్ వైర్లు, ఉచ్చు సామగ్రిని స్వాధీనం చేసుకున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

కొత్తపల్లి, ఆగస్టు 22: రాత్రి వేళల్లో అడవి పందుల కోసం ఉచ్చులు వేసే వేటగాళ్లే విద్యుత్ కోతలకు కారణమని ఆత్మకూరు విద్యుత్ ఏడీ రమేష్ అన్నారు. గురువారం విద్యుత్ ఏడీ మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో గత పది రోజులుగా ఉన్నట్లుండి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఏడీ, ఏఈలతో పాటు పరిశీలించామన్నారు. అడవి పందుల వేట కోసం రాత్రివేళల్లో పంట పొలాల్లో విద్యుత్ వైర్లు అమర్చి నేరుగా మెయిన్‌లైన్‌కు వేటగాళ్లు వైర్లు తగిలిస్తున్నట్లు గుర్తించామన్నారు. దీని వల్ల పంట పొలాలకు, ఇండ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నదని అన్నారు. శివపురం, గుమ్మడాపురం, సింగరాజుపల్లి, ఎర్రమఠం, పాతమాడుగుల, కపిలేశ్వరం, సంగమేశ్వరం గ్రామాల్లో అడవి పందుల కోసం వేటగాళ్లు విద్యుత్ వైర్లు అమర్చుతున్నారని అన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో దారుణం

- పిల్లాడు అల్లరి చేశాడని వాతలు పెట్టిన ఆయా
- షోకాజ్ నోటీసులు జారీ చేసిన ఐసీడీఎస్ సీడీపీవో



ఆయా పెట్టిన వాతలతో గాయపడిన అబ్దుల్ సమీర్

ఆత్మకూరు, ఆగస్టు 22: ఆత్మకూరు పట్టణంలోని ఓ అంగన్‌వాడీ సెంటర్ దారుణం చోటుచేసుకుంది. పిల్లాడు అల్లరి చేస్తున్నాడన్న కారణంతో శేషమ్మ అనే ఆయా వాతలు పెట్టింది. ఈ సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణంలోని రాజావీధికి చెందిన వలి కుమారుడైన మూడేళ్ల అబ్దుల్ సమీర్ 22వ అంగన్‌సెంటర్‌లో శిశువిద్యను చదువు తున్నాడు. బుధవారం సెంటర్ అంగన్ వాడీ వర్కర్ ఖాదర్‌బీ మాతా శిశుసంరక్షణ పథకంలో భాగంగా గర్భిణీలు, బాలింతల ఇళ్ల వద్దకు క్షేత్ర పర్యటనకు వెళ్లడంతో సెంటర్ ఆయా శేషమ్మ పిల్లలను పర్యవేక్షించింది. ఆ సమయంలో అబ్దుల్‌సమీర్ అల్లరి చేస్తుండటంతో ఆయా సలాకీ కాల్చి చేతికి, కాలికి వాతలు పెట్టింది. చర్మం పొంగడంతో బాలుడి తల్లిదండ్రులు శేషమ్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీవో లీలావతి గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయా శేషమ్మను విధుల నుంచి తొలగించనున్నట్లు సీడీపీవో లీలావతి వెల్లడించారు.

అక్రమ లే అవుట్లపై అధికారుల కన్నెర్ర

- అనుమతులు తెచ్చుకొని లేఅవుట్లు వేసుకోండి
- కుడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 130 అక్రమ లే అవుట్ల గుర్తింపు



అక్రమ లే అవుట్ల కూల్చివేత సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ కృష్ణయ్యయాదవ్



అక్రమ లేఅవుట్లను తొలగిస్తున్న కుడా అధికారులు

బనగానపల్లె, ఆగస్టు 22: అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొంటే ప్రజలు ఇబ్బందులు పడతారని కుడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం బనగానపల్లె, భానుముక్కల, మిట్టపల్లె, హుసేనాపురం, యనకండ్ల గ్రామాల్లో అక్రమంగా వేసిన 40 లే అవుట్లను ఎక్స్‌కవేటర్లతో కూల్చివేసే పనులు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు అక్రమ లే అవుట్లను జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, కూడా ప్లానింగ్ అధికారి సంధ్య, కూడా సిబ్బంది వచ్చి కూల్చివేశారు. ఈ సందర్భంగా కుడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 53 మండలాల్లో ఉన్న అనధికారి లే అవుట్లపై చర్యలు తీసుకోవడానికి గత మూడు నెలల నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. ఉమ్మడి జిల్లాల్లో 130 అక్రమ లే అవుట్లను గుర్తించినట్లు తెలిపారు. లే అవుట్ల యజమానులకు చట్టప్రకారం అనుమతులు తీసుకోవాలని గతంలో నోటీసులు అందించాం. అయినా వారు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వం అక్రమ లే అవుట్లపై కొరడా ఝుళిపించినట్లు తెలిపారు. గత మూడు నెలలుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అక్రమ లే అవుట్ల యజమానులకు తమ సిబ్బంది చట్టప్రకారం అనుమతులు తీసుకోవాలని పలుసార్లు నోటీసులు ఇచ్చామన్నారు. లే అవుట్ల యజమానులకు నోటీసులు ఇస్తున్నప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాధానం రావడం లేదన్నారు. అందుకే జిల్లా వ్యాప్తంగా అక్రమ లేఅవుట్లను కూల్చివేస్తున్నట్లు తెలిపారు. లేఅవుట్లు వేసిన యజమానులు ప్లాట్ల రూపంలో అమాయక ప్రజలకు అమ్ముకుంటున్నారన్నారు. లే అవుట్లలో కనీస వసతులు కల్పించడం లేదన్నారు. బనగానపల్లె మండలంలో 40 అక్రమ లే అవుట్లను గుర్తించామన్నారు. వాటి యజమానులకు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో అక్రమ లే అవుట్లను కూల్చివేస్తున్నట్లు తెలిపారు. మొదటి దశలో నోటీసులు ఇచ్చామని, స్పందించపోవడంతో కూల్చివేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా లే అవుట్ల యజమానులు తప్పనిసరిగా కూడా అనుమతులు తీసుకొని వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కూల్చివేసిన లే అవుట్లలో యజమానులు అభివృద్ధి పనులు చేసినట్లయితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు లే అవుట్ యజమాని, సర్వేనంబరు పేపర్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దని సూచించారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు, నంద్యాల, బనగానపల్లె పాణ్యం, ఎమ్మిగనూరు, ఆదోని, నందికొట్కూరు తదితర ప్రాంతాల్లో 50 లే అవుట్లు కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. లే అవుట్లలో పదిశాతం గ్రామ పంచాయతీకి పార్కులు నిర్మించుకోవడానికి స్థలం ఇవ్వాలన్నారు. లే అవుట్లు వేయాలంటే ఖచ్చితంగా కూడా అనుమతి తప్పని సరి అని కాని గ్రామ పంచాయతీలకు లే అవుట్లను ఆమోదించే అధికారం లేదన్నారు. ఎన్ని రాజకీయ వత్తిళ్లు ఉన్నా అక్రమ లే అవుట్లను కూల్చివేయడం ఖాయమని కుడా వైస్ చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె సీఐ కృష్ణయ్యయాదవ్, నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, పోలీసు సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు తులాల బంగారం చోరీ

ఆదోని, ఆగస్టు 22: ఆదోని పట్టణం తిరుమల నగర్‌లో బుధవారం రాత్రి నాలుగు ఇళ్లల్లో దొంగలుపడ్డారు. తిరుమల నగర్ కాలనీలోని బేల్దారి రామమూర్తి బుధవారం తన ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దుండగులు బుధవారం రాత్రి ఇంటికి ఉన్న కాలాన్ని పగలగొట్టి లోపలకు చొరబడ్డారు. బీరువాలో ఉంచిన మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు, రూ. 2వేలు నగదు, 10 గ్రాముల వెండిని దొంగిలించారు. ఇదే కాలనీలో మరో మూడు ఇళ్లల్లో కూడా దొంగలు చొరబడ్డారు. ఆ ఇళ్ల యజమానులు ఊర్లో లేకపోవడంతో ఇతరులు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారు వచ్చాక వివరాలు తెలుస్తాయని స్థానికులు అంటున్నారు. తమకు ఫిర్యాదులు చేయలేదని త్రీ టౌన్ సీఐ రామలింగప్ప తెలిపారు.

రైతు ఆత్మహత్య

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు22: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి పొద్దుపోయాక మల్కాపురం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఉరుకుందయ్య(40) తనకున్న మూడు ఎకరాల్లో పత్తి, మిరప పంటలను సాగు చేసి రూ.9.50 లక్షల అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అరెస్టు

ఆదోని రూరల్ ఆగస్టు 22 : ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన లక్ష్మిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం తన నివాసంలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 90మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దతుంబళం ఎస్.ఐ తెలిపారు.

భర్తపై ఫిర్యాదు.. పెద్దతుంబళంకు చెందిన నాగమ్మ భర్త వీరేష్‌పై ఫిర్యాదు చేసింది. రోజు మద్యం సేవిస్తూ, అదనపు కట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తుండడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

పెళ్లి పందిరిలో విషాదం

- తెల్లవారితే పెళ్లి
- వరుడి తండ్రి మృతి



బొత్తల శ్రీను (ఫైల్)

శిరివెళ్ల, ఆగస్టు 22: పెళ్లి పందిరిలో విషాదం చోటు చేసుకుంది. కొన్ని గంటల వ్యవధిలో కొడుకు పెళ్లి చూడాల్సిన తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. శిరివెళ్లకు చెందిన బొత్తల శ్రీను కుమారుడి వివాహాన్ని ప్రకాశం జిల్లా గిద్దలూరులో నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు బుధవారం రాత్రి గిద్దలూరుకు బయలుదేరి వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి శ్రీను కల్యాణ మండపంలో అనారోగ్యానికి గురై తుది శ్వాస విడిచాడు. దీంతో వధూవరుల కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. శ్రీను మృతదేహాన్ని స్వగ్రామమైన శిరివెళ్లకు తరలించి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 22: నంద్యాలలోని రైతు నగరం సమీపంలో విద్యుదాఘాతంతో సంతోష్ (20) అనే యువకుడు మృతి చెందినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. పట్టణంలోని నడిగడ్డకు చెందిన శ్రీనివాసులు కుమారుడు సంతోష్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గురువారం రైతు నగరంలో పని చేస్తుండగా ఓ యంత్రానికి సంబంధించి కరెంట్ వైర్లను సంతోష్ ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. యువకుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నందికొట్కూరు, ఆగస్టు 22: నందికొట్కూరు ఇనుప సామాన్ల దుకాణంలో పని చేస్తున్న మహబూబ్‌బాషా (28) అనే వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా నందికొట్కూరు పట్టణంలోని ఓ ఇనుప సామాన్ల దుకాణం వద్ద పని చేసున్నాడు. పని చేస్తున్న సమయలో అతని కాలికి విద్యుదాఘాతం తగిలి అక్కడిక్కడే కుప్పకూలి పడిపోయాడు. అక్కడ పని చేసే సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న తర్వాత ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి చిన్న మహబూబ్‌బాషా ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

కూలిన మట్టి మిద్దెలు



కూలిన మట్టిమిద్దె

వెల్దుర్తి, ఆగస్టు, 22: వెల్దుర్తి పట్టణంలో బుధవారం కురిసిన వర్షానికి రెండు మట్టి మిద్దెలు కూలిపోయాయి. 7వ వార్డు కొలంబావి వీధిలో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మి కుటుంబం బయట గదిలో నిద్రిస్తుండగా వంటగది కూలింది. అదే విధంగా 13వ వార్డు రైల్వేస్టేషన్ వీధిలో ఇబ్రహీమ్ కుటుంబం బయటగదిలో నిద్రిస్తుండగా లోపలిగది కూలిపోయింది. ఈ రెండు కుటుంబాలు బయటి గదిలో నిద్రిస్తుండడంతో ప్రాణనష్టం జరగలేదు. వీరిరువురు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఐచర్ డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దుర్తి, ఆగస్టు, 22: ద్విచక్ర వాహనదారుడిని ఐచర్ వాహనం ఢీ కొన్న ఘటనలో ఐచర్ వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ గురువారం తెలిపారు. 20వ తేది డోన్ నుంచి కర్నూలుకు బైక్‌పై వెళుతున్న వంశీకృష్ణ నాయక్‌కు జాతీయ రహదారి-44 పెట్రోల్ బంకు సమీపంలో గొర్రెల మంద అడ్డు వచ్చింది. ఆగిన బైకును ఐచర్ వాహనం వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వంశీకృష్ణకు గాయాలయ్యాయి. వెంటనే గొర్రెల కాపలాదారులు క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వంశీకృష్ణ అన్న హరిచరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఐచర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

తాగునీటి సరఫరా బిల్లుల చెల్లింపులో జాప్యం

బేతంచెర్ల నగర పంచాయతీలో తారతమ్యం



బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయం ఇదే

బేతంచెర్ల, ఆగస్టు 22: బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలోని ఓ కీలక అధికారి అనుమతి లేనిదే ఏ పని జరగడం లేదు. కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు అందరి మీద ఆయన పెత్తనం నడుస్తోంది. కార్యాలయంలో ఏ పని చేయాలన్నా చేయి తడపనిదే ఒక్క పని కూడా జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఓ కీలక అధికారి వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో నవంబరు నుంచి భూగర్భ జలాలు బోర్లలో అడుగంటడంతో నగర పంచాయతీ ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడింది. అందుకుగాను పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి రోజువారిగా రూ.2,400 ప్రకారం ఒక్కొక్క ట్రాక్టర్‌కు రోజు బాడుగ కింద జూన్ వరకు మూడు నెలలు రాత్రి పగలు నీటి ట్యాంకర్లను తెప్పించి ప్రజల దాహార్తిని తీర్చారు. అయితే ట్రాక్టర్ల యజమానులకు బిల్లుల కేటాయింపులో తారతమ్యం చూపుతున్నారు. కొంత మందికి 8 నెలలైనా బిల్లులు ఇవ్వలేదు. దీంతో ట్రాక్టర్ల యజమానులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అయినా పట్టించుకునే పరిస్థితి ఆయనకు లేదని ట్రాక్టర్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ డిపార్టుమెంటు నగర పంచాయతీ ప్రజలకు తాగునీరు సరఫరా చేసిన నీటి ట్యాంకర్ల యజమానుల పేర్లను కూడా ఓ కౌన్సిలర్ చెప్పినట్లు ప్రకటిస్తున్నారని వాపోతున్నారు. ఓ కౌన్సిలర్‌తో సదరు అధికారి సన్నిహితంగా ఉంటూ తాగునీటి సరఫరా బిల్లులను తారుమారు చేస్తున్నట్లు ట్రాక్టర్ల యజమానులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయంగా రావాల్సిన బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయంపై నగర పంచాయితీ కమిషనర్ రమేష్ బాబు వివరణ కోరగా నగర పంచాయతీ పరిధిలో ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రజల కోసం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశామన్నారు. గత ప్రభుత్వంలో కొంత మంది నీటి ట్రాక్టర్ల ట్యాంకర్ల యజమానులకు బిల్లులు మంజూరయ్యాయని, మరికొంతమందికి మంజూరు కాలేదన్నారు. బిల్లులు మంజూరైతేనే తాము కూడా ఇవ్వగలమన్నారు.

గొలుసు దొంగల హల్‌చల్

కర్నూలు, ఆగస్టు 22: తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలాజీనగర్‌లో గొలుసు దొంగలు హల్‌చల్ చేశారు. గురువారం సాయంత్రం రత్నమ్మ అనే మహిళ మెడలో నుంచి గొలుసు తెంపుకునే ప్రయత్నం చేశారు. రత్నమ్మ తన భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా.. వీరి బైక్‌ను ఇద్దరు ఆగంతకులు అనుసరించారు. ఈ క్రమంలో దుండగులు ఆమె మెడలోని గొలుసు తెంపుకుని పరారయ్యే యత్నం చేశారు. బాధితురాలు అప్రమత్తం కావడంతో తెగిపోయినా కూడా గొలుసు మాత్రం ఆమె మెడలో ఉండిపోయింది. ఆ తర్వాత ఆగంతకులు పరారయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. గొలుసు దొంగల కోసం సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

రైతుకు అండగా ఉపాధి హామీ

- వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.180 కోట్ల ఖర్చుకు ప్రణాళిక
- 23 నుంచి గ్రామ సభలు
- హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు



కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 22: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించింది. ఆనాటి పాలకులు, వారి అనుచరులు పెద్ద ఎత్తున జేబులు నింపుకున్నారు. ఏ మాత్రం ప్రజలకు పెద్దగా ప్రయోజనం చేకూర్చని పనులకు నిధులు ఖర్చు చేసేశారు. దీంతో వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులు లేక రైతులు పంటల సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రైతులకు అధిక ప్రయోజనం చేకూర్చేలా అమలు చేయాలని ఆయా జిల్లాల నీటి యాజమాన్య సంస్థ జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. గ్రామాల్లోని రైతులు, ఇతర వ్యవసాయ కూలీలకు పెద్ద ఎత్తున పనులు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశాలు వచ్చాయని కర్నూలు జిల్లా డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

అవగాహన లేక

ఉపాధి చట్టంపై రైతులు, వ్యవసాయ కూలీలకు ఇప్పటి దాకా అవగాహన లేదు. దీని వల్లనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం రూ.300 పొందలేకపోతున్నారు. ఇప్పటి దాకా రోజు కూలి రూ.230 నుంచి రూ.250లు మాత్రమే వ్యవసాయ కూలీలు పొందుతున్నారని, ఇకపై పూర్తి స్థాయిలో కూలీ డబ్బులను వారికి అందేలా చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

పెద్ద ఎత్తున వ్యవసాయ అనుబంధ పనులు

రెండు జిల్లాల్లో దాదాపు రూ.300 కోట్లకు పైగానే వ్యవసాయ అనుబంధ శాఖల పరిధిలోని పనులను ఈ గ్రామ సభల్లో ఖరారు చేయనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఇకపై ప్రణాళిక మేరకు పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే చేసిన పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నా సామాజిక తనిఖీలపై అభ్యంతరాలున్నా కొత్తగా గుర్తించిన పనులు, వాటి ప్రగతి వ్యవసాయ కూలీలకు వేతనం, గిట్టుబాటు తదితర అంశాలపై గ్రామ పంచాయతీల్లో 23వ తేదీన నిర్వహిస్తున్న గ్రామసభల్లో నిర్ణయాలు ఖరారు చేయనున్నారు. చెరువులు, ప్రధాన జలాశయాల కాలువల్లో పూడికతీత, ఫీడర్ కాలువల నిర్మాణం, కొత్త పంట కాలువల తవ్వకం, నర్సరీల పెంపకం, పశువులు పొలాల్లో మేత వేయకుండా రక్షణ కందకాలు, రైతుల భూముల్లో నీటి కుంటల నిర్మాణం, భూమి చదును వంటి 46 రకాల పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇప్పటికే గుర్తించిన పనులను జిల్లాలో చేపట్టారు. ఇకపై చేపట్టబోయే పనులపై గ్రామ సభలు నిర్వహించి ఆమోదం తీసుకోవడం జరుగుతుందని, ఈ పనులకు సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు వస్తే వాటిని పరిగణనలోకి తీసుకుని పరిష్కరిస్తామని పీడీ అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

మంత్రి బీసీని కలిసిన మల్లెల రాజశేఖర్


మంత్రి బీసీకి సమస్యలు వివరిస్తున్న రాజశేఖర్

ఓర్వకల్లు, ఆగస్టు 22: రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గురువారం విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి, హుశేనాపురం నుంచి గడివేముల వరకు కొమరోలు నుంచి సోమయాజులపల్లె వరకు రోడ్ల విస్తరణ పనులకు నిధులు విడుదల చేయాలని మంత్రి కోరినట్లు మల్లెల రాజశేఖర్ తెలిపారు. స్పందించిన మంత్రి రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు రాజశేఖర్ తెలిపారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 22: రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డీటీఎఫ్ డిమాండ్ చేసింది. గురువారం డీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గట్టు తిమ్మప్ప, పత్రికా ప్రధాన సంపాదకులు రత్నం ఏసేపు, సుబ్బరాయుడు, ముమేన్, శివనాగరాజు, రాఘవేంద్రలు మాట్లాడుతూ 11వ పీఆర్సీ బకాయిలను చెల్లించాలని కోరారు. పెండింగ్ డీఏ బకాయిలను చెల్లించాలని, సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేయాలని ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు.

డాక్టర్ కేజీ గోవిందరెడ్డికి ఉత్తమ పురస్కారం

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 22: మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాదులోని శిల్పారామంలో కర్నూలు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డికి ఉత్తమ పురస్కార అవార్డు లభించింది. జిల్లాలో రక్తదానం, నేత్రదానం, తలసీమియా పిల్లలకు అత్యవసర సమయంలో రక్తాన్ని ఇవ్వడం, అవయవదానంపై అవగాహన కల్పించినందుకు కేజీ గోవిందరెడ్డికి ఉత్తమ పురస్కార అవార్డును సినీ నటుడు ఆర్కే సాగర్ అందజేశారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ఓర్వకల్లు, ఆగస్టు 22: ఓర్వకల్లులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ఎంఈవో ఓంకార్ యాదవ్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో 2024-25 విద్యాసం వత్సరానికి సంబంధించిన విద్యార్థులకు దుస్తులు పంపించామన్నారు.

'గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి'

కల్లూరు, ఆగస్టు 22: కల్లూరు మండలంలోని 18 పంచాయతీల పరిధిలో శుక్రవారం జరగనున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మన్న, ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఓలు మద్దీశ్వరమ్మ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం జరిగే గ్రామ సభలను జయప్రదం చేయాలని ఎంపీడీవో శివనాగప్రసాద్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

ఉక్కు పరిశ్రమలో ప్రాణనష్టం జరగలేదు

జయరాజ్ ఇస్పాత్ సంస్థ ఎండీ శ్రీనివాస కుమార్


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

ఓర్వకల్లు, ఆగస్టు 22: ఓర్వకల్లు మండలంలోని గుట్టపాడు గ్రామ సమీపాన నిర్మిస్తున్న జయరాజ్ ఇస్పాత్ (ఉక్కు పరిశ్రమ)లో అగ్ని ప్రమాదం సంభవించినా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, అయితే.. కొందరు ప్రాణాలు కోల్పోయినట్లు, గాయడినట్లు కొన్ని చానెళ్లు, యూట్యూబ్ చానెళ్లు ప్రచారం చేశాయని, అవన్నీ పుకార్లేనని జయరాజ్ ఇస్పాత్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస కుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని గురువారం తహసీల్దార్ వెంకటరమణ, ఎస్‌ఐ సునీల్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ప్యానెల్స్‌ను పరిశీలించారు. అనంతరం జరిగిన సంఘటనపై కార్మికులతో ఆరా తీశారు. అయితే బుధవారం పీసీసీ మొదటి ఫ్లోర్‌లో గ్యాస్ ఫిల్లింగ్ చేస్తుండగా.. లీక్ కావడంతో ఆ రూం అంతా నల్లటి మబ్బులు కమ్ముకోవడంతో కార్మికులు బయటికి పరుగులు తీశారు. అయితే ఎలాంటి ప్రాణహానీ జరగలేదు. అయితే.. రెండో ఫ్లోర్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ప్యానెల్స్ మాత్రమే నల్లగా అయ్యాయని, వీటిని కూడా శుభ్రం చేయిస్తున్నామని ఎండీ శ్రీనివాస కుమార్ తెలిపారు.

గుండె పోటుతో యువకుడి మృతి


సులేమాన్(ఫైల్)

సి.బెళగల్, ఆగస్టు 22: మండలంలోని పోలకల్లులో గుండెపోటుతో సులేమాన్(36) అనే యువకుడు మృతి చెందాడు. సులేమాన్ గ్రామంలో గౌండ పనిచేస్తు జీవనం కొనసాగించేవాడు. గురువారం ఆకస్మికంగా గుండెలో మంట ఉందని పోలకల్లు పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం వెళ్లాడు. అక్కడ వైద్యులు ఎవరూ లేకపోవడంతో అంబులెన్సు ద్వారా కర్నూలుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సంతోషమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈవిషయం తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు, గ్రామ సర్పంచ మాదక్క, సోమన్న, భీమన్న, అమర్ సంతాపం తెలిపారు.

క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 22: కర్నూలు డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల బాలబాలికల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జి.భూపతిరావు, క్రీడాదాత, న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో స్విమ్మింగ్ 80, జిమ్నాస్టిక్ 70, అథ్లెటిక్ 200 మంది మొత్తం 350 మంది క్రీడా కారులు హాజరయ్యారు. విజేతలకు ఈనెల 29న క్రీడాదినోత్సవం సందర్భంగా మెడల్స్‌ను కలెక్టర్ చేతుల మీదుగా అందజేస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, అసోసియేషన్ సంఘాలు, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అమ్మపేరుతో మొక్కలు నాటండి

కలెక్టర్ పి.రంజిత్‌బాషా


మామిడి మొక్కను నాటి నీరుపోస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 22: ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం ఉదయం అమ్మ పేరుతో మొక్క కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన తన తల్లి పేరుతో మామిడి మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏక్ పేడ్ మాకే నామ్ అనే కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో ప్రారంభించి సెప్టెంబరు 2024 నాటికి 80 కోట్ల మొక్కలను, మార్చి 2024 నాటికి 140 కోట్ల మొక్కలను నాటాలనే లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. జిల్లాలో లక్ష మొక్కలను నాటుతున్నామన్నారు. ప్రతి గ్రామ పంచాయితీలోనూ, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలోనూ ప్రతి ఒక్కరూ వారి తల్లుల పేరుపై మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటిన అనంతరం సంబంధిత ఫొటోలు మేరీ లైఫ్ పోర్టల్‌లో అప్‌లోడు చేసేందుకు కూడా అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో శివనాగప్రసాద్ అన్నారు. గురువారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటి పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ నాయకులు చంద్రపెద్దస్వామి, అబ్దుల్లా, రాంభూపాల్ రెడ్డి, అబ్దుల్లా, శోభన్‌బాబు, నాగరాజు, హౌసింగ్ ఏఈ రామయ్య, ఈవోఆర్డీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి.. పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో రాముడు అన్నారు. గురువారం మండలంలోని బురాన్ దొడ్డి ఉన్నత పాఠశాల, సిబెళగల్ జడ్పీ ఉన్నత పాఠశాల అవరణాలలో గురువారం ఎంపీడీవో రాముడు, ఏపీవో లక్ష్మన్న, ఈసీ పృధ్వీ రాజు, సర్పంచులు, టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిర్మలావసంతకుమారి, పాఠశాల చైర్మన్లు డీస్ వెంకటేశ్, రాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.

కల్లూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కల్లూరు మండల ఎంపీపీ బి.శారద, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలం సల్కాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సర్పంచు మద్దిలేటి, ఏపీడీ లక్ష్మన్న, ఏపీఓలు మద్దీశ్వరమ్మ, రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని ముడుమలగుర్తిలో అమ్మ కోసం మొక్క కార్యక్రమం కింద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ, టీడీపీ నాయకుడు ఎం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం పాఠశాల, చెత్తసంపద కేంద్రం వద్ద మొక్కలు నాటారు. అమడగుంట్లలో సర్పంచ్ వరలక్ష్మీ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయిఈశ్వరప్ప, గోపాల్, మల్లేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీ ప్లాంటుకు మళ్లీ జీవం

లీజుకు ఇచ్చేందుకు అధికారుల నిర్ణయం


కోల్డ్ స్టోరేజీ ప్లాంటు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 22: గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.4కోట్లు ఖర్చు పెట్టి కోల్డ్ స్టోరేజీ ప్లాంటు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. దాదాపు సగం పని పూర్తయిన తర్వాత 2019లో అధికారంలోకి వైసీపీ ప్రభుత్వం ఈ నిర్మాణాన్ని గాలికొదిలేసింది. ఈ ప్లాంటు వల్ల వందలాది మంది రైతులకు ఉపయోగంగా ఉంటుంది. కోల్డ్ స్టోరేజీ ప్లాంటు ఏర్పాటైతే.. మిరప, పసుపు తదితర ఆహారోత్పత్తులను వాణిజ్య పంటల ఉత్పత్తులను మార్కెట్‌లో ధర అందనప్పుడు రైతులు ఇక్కడ భద్రపరుచుకోవచ్చు. అయితే.. గత వైసీపీ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను ఏ మాత్రం పట్టించుకోలేదు. మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో పర్యటించిన సమయంలో పనులు మధ్యలో ఆగిపోయిన కోల్డ్ స్టోరేజీ ప్లాంటు పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు మొరపెట్టుకున్నారు. మార్కెటింగ్ శాఖ డీఈఈ సుబ్బారెడ్డి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న, తదితరులు ఈ ప్లాంటు ఏర్పాటైతే.. ప్రకృతి వైపరీత్యాల వల్ల ధరలు లేని సమయంలో రైతులు పంట ఉత్పత్తులను తక్కువ అద్దెకే నిల్వ చేసుకోవచ్చని కమిషనర్ దృష్టికి తెచ్చారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఈ ప్లాంటును నిరూపయోగంగా ఉంచడం సమంజసం కాదని కమిషనర్ పేర్కొన్నారు. వెంటనే కోల్డ్ స్టోరేజీ ప్లాంటును వినియోగంలోకి తెచ్చి రైతులకు ప్రయోజనం తెస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ ప్రకటనతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

26న రేమడూరులో కృష్ణాష్టమి

వేడుకలకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు ఆహ్వానం


గౌరు చరితకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

కల్లూరు, ఆగస్టు 22: కల్లూరు మండలం రేమడూరు గ్రామంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక రేమడూరు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 26న కృష్ణాష్టమి వేడుకలు జరగనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఓబు లేసు, పురుషోత్తం తెలిపారు. గురువారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో గౌరు చరిత, గౌరు వెంకట రెడ్డిలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ వేడుకల్లో పాల్గొనాలని గౌరు దంపతులను ఆహ్వానించారు. సోమవారం ఉదయం 7 గంటలకు పూజా మండపం వద్ద శ్రీకృష్ణుడికి పూజా కార్యక్రమం, భగవద్గీత పఠ నంతో వేడుకలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. శేషయ్య, ఈశ్వరయ్య, సుదాకర్, శివ, చైతన్య, హర్షవర్ధన్‌రెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో శామ్యూల్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 22 : జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో ఈ నెల 23వ తేదీన జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి కే.శామ్యూల్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గురువార తన కార్యాలయంలో జాతీయ అంతరిక్ష దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయాన్ని గుర్తు చేసుకోవడానికి భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. కాబట్టి అన్ని పాఠశాలల్లో, శిక్షణా సంస్థల్లో విద్యార్థులకు వర్క్‌షాపులు, ప్రదర్శనలు, ఉపన్యాసాలు నిర్వహించాలన్నారు. క్విజ్, పోటీలు, చంద్రయాన్ నమూనా తయారీ, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. చంద్రయాన్ విజయంపై జాతీయ విద్యా పరిశోధన సంస్థ రూపొందించిన వీడియోలను జాతీయ అంతరిక్ష దినోత్సవం రోజున పాఠశాలలో ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల జీసీడీవో స్నేహలత, ఏడీ శామ్యూల్ పాల్, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో బయటి వ్యక్తులకు టెండర్ వద్దు


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కల్లూరు, ఆగస్టు 22: విద్యుత్‌శాఖలో లోడింగ్, అన్ లోడింగ్ పనులను బయటి వ్యక్తులకు టెండర్ ఇవ్వవద్దని సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్. సాయిబాబా డిమాండ్ చేశారు. గురువారం ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాల్లో విధులు బహిష్కరించి సీఐటీయూ కార్మికులు నిరసన చేపట్టారు. అనంతపురం జిల్లా స్టోర్స్‌లో బయటి వ్యక్తులతో పనిచేయడానికి టెండర్ పిలవడాన్ని నిరసిస్తూ విద్యుత్‌శాఖ కార్యాలయంలోని స్టోర్స్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న లోడింగ్, అన్ లోడింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వ కుండా యాజమాన్యం అడ్డదారిలో బయటి వ్యక్తులకు పని ఇవ్వడానికి టెండర్లు పిలవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, ఎస్‌పీడీసీఎల్ ఉపాధ్యక్షుడు పి. నాగరాజు, కార్మికులు మోహన్ చలపతి, విజయ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులకొట్టి రాగి అపహరణ

గూడూరు ఆగస్టు 22: గూడూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు పొలంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను పగులగొట్టి అందులోని రాగి తీగలు అపహరించుకపోయారు. బుధవారం రాత్రి టీడీపీ నేత గజేంద్ర గోపాల్ నాయుడు పొలంలో ఉన్న ట్రాన్‌పార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి అందులోని రాగి తీగలు అపహరించుకొని వెళ్ళారు. ఈ సంఘటనను ఎస్‌ఐ, విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్ళినట్లు గజేంద్ర గోపాల్ నాయుడు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: సీఐటీయూ



గూడూరు బస్టాండులో నిరసన తెలుపుతున్న నాయకులు

గూడూరు ఆగస్టు 22: దేశంలో మహిళలపై, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టాలంటే నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థిని అత్యాచార హత్యపై నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గూడూరులో ఆశాలు, వీవోఏలు, ఆర్పీ, ఆటో, మున్సిపల్ యూనియన్ల నాయకులు, కార్యకర్తలు గూడూరు ప్రధాన బస్టాండులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి జే.మోహన్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు శేషమ్మ, వీవోఏల సంఘం మండల నాయకురాలు మనోహరి, మహిళా సంఘా నాయకురాలు భారతి మాట్లాడుతూ దేశంలో మహిళలు, పసిపిల్లలు, బాలికలు వృద్ధులపై కూడా రోజురోజుకూ అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి, గిరిజ, సావిత్రి, చంద్రకళ, సూరన్న, హేమంత్, ప్రభావతి, యశోధ, బారతి, సూర్యశేఖర్, రాజు, రవి పాల్గొన్నారు.

యువతకు చిరంజీవి స్ఫూర్తి


చిరంజీవి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జనసేన నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 22: సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతకు సినీ నటుడు చిరంజీవి స్ఫూర్తిగా నిలుస్తారని జనసేన పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జి షేక్ అర్షద్ అన్నారు. గురువారం సెంట్రల్ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో చిరంజీవి 69వ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంకృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించిన చిరంజీవి రక్తదానం, నేత్రదానం వంటి సామాజిక కార్యక్రమాలతో అందరివాడుగా నిలిచాడన్నారు.

'సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలి'


జూడాలకు మద్దతుగా దీక్షల్లో కూర్చున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 22: వైద్యుల భద్రతకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వీ. బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కోల్‌కత్తా వైద్యురాలి హత్యను నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన రిలే దీక్షలకు జన విజ్ఞాన వేదిక సంఘీభావం ప్రకటించింది. జూడాలకు మద్దతుగా డా. బ్రహ్మారెడ్డి సభ్యులు రిలే దీక్షల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా డా. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కొత్త చట్టాలతో కాలయాపన చేయరాదని ఉన్న చట్టాల్లో అత్యధిక శిక్ష ఏది ఉంటే దాని అమలు చేయాలని కోరారు. సమాజంలో పురుషాధిక్యం ఉందని, పురుషుల్లో స్త్రీల పట్ల వారి దృక్పథంలో మార్పు రావాలని అప్పుడే అత్యాచారాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్, జాతీయ నాయకులు మహ్మద్ మియా, శేషాద్రిరెడ్డి, రామలక్ష్మణ్, న్యాయవాది, శంకర్‌రావు, సుజాత, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను ఆలూరులోనే కొనసాగించాలి


సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 22: ఆలూరులోని ప్రభుత్వ బాలికల గిరిజన గురుకుల పాఠశాలను తుగ్గలికి మార్చడం వల్ల విద్యార్థినులు వారి చదువుకు దూరం అవుతారని, అందువల్లనే ఆలూరు మండలం లోనే కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లాలు కోరారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ సూపరింటెండెంట్ సిమోన్‌కి వారు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల అనేది మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనుల పిల్లల సంక్షేమం కోసం ఏర్పాటు చేశారన్నారు. ఈ పాఠశా లను వేరేచోటకు మార్చకూడదన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు వీల్ చైర్స్ పంపిణీ


స్టాండ్‌ను అందజేస్తున్న డాక్టర్ శైలేష్ కుమార్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 22: ఫ్లోరోసిస్ వ్యాధదితో బాధపడుతున్న బాధితులకు చేతి కర్రలు, మెడ, నడుము పట్టీలు, వీల్ చైర్స్‌ను ఫ్లోరోసిస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.శైలేష్ కుమార్, కన్సల్టెంట్ సుధాకర్ పంపిణీ చేశారు. కల్లూరు మండలం పుసులూరు గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అనంతరం రేమడూరు మండలం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తుల్లో ఎన్నో విష పదార్థాలు ఉంటాయనీ, సరాదాగా మొదలయ్యే ఈ అలవాటు వ్యసనంగా మారి ప్రాణాలు తీస్తుందన్నారు. నిల్వ ఉండే చిరు తిండ్లు, శీతల పానియాలు రెడిమెడ్ చిప్స్, ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల్లో అధికంగ ఫ్లోరైడ్ ఉంటుందన్నారు. ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఈ వ్యాధి దంతాలకు సంబంధించిదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రంగన్న, ప్రాజెక్టనిస్టు ఖలీల్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.


ఆక్రమ కట్టడాల కూల్చివేత

కల్లూరు, ఆగస్టు 22: కల్లూరు అర్బన్ శివప్పనగర్‌లో పబ్లిక్ బోరు, రోడ్డును ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన ఆక్రమ కట్టడాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. కాలనీవాసుల ఫిర్యాదు గురువారం మేరకు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ కట్టడాలను తొలగించారు. శివప్పనగర్‌లో ప్రజా అవసరాలకు ఏర్పాటు చేసిన పబ్లిక్ బోరు చుట్టూ, అలాగే రోడ్డును ఆక్రమించి కాంపౌండ్ ఏర్పాటు చేశారన్న ఫిర్యాదుతో అక్కడికి చేరుకుని ఆక్రమణలు తొలగించినట్లు అధికారులు తెలిపారు. సచివాలయ సిబ్బంది, అధికారులు ఉన్నారు.

పంట నమోదుతో ప్రయోజనాలు

కోడుమూరు(రూరల్), ఆగస్టు 22: పంట నమోదు జరిగితేనే ప్రభుత్వ ప్రయోజనాలు చేకూరుతాయని వ్యవసాయాధికారి రవిప్రకాష్ గౌడ్ తెలిపారు. మండలంలోని వెంకటగిరి గ్రామంలో పంట నమోదు ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

కోడుమూరులో భారీ వర్షం


వర్షపునీటితో నిండిన చెక్‌డ్యాం

కోడుమూరు(రూరల్), ఆగస్టు 22: మండలంలో బుధవారం అర్ధరాత్రి ఈదురు గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. వర్షంరాకతో ఉల్లి, పత్తి, కంది వంటి పంటలకు ఎరు వులు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వర్షపునీటితో చెక్‌డ్యాంలు నిండి కళకళలాడుతున్నాయి. మండలంలో 46.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

గూడూరు: గూడూరు మండలంలో బుధవారం రాత్రి మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. 43.2 ఎం.ఎంగా వర్షపాతం నమోదైయినట్లు అధికారులు తెలిపారు. పంటలకు ఈ వర్షం ఊపిరినిచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

సెబీ చీఫ్ రాజీనామా చేయాలి: కాంగ్రెస్


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 22: సెబీ చీఫ్ మాధురీ పురి బచ్చన్ వెంటనే రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే బాబురావు డిమాండ్ చేశారు. గురువారం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెబీ చీఫ్ మాధురీ పూరీ బచ్చన్, ఆదానీ గ్రూప్ సంస్థల వ్యవహారంపై సంయుక్తంగా పార్లమెంటరీ సంఘం జేపీసీ వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, నాయకులు షేక్ జీలానీ బాషా, అనంతరత్నం మాదిగ, బతుకన్న, ప్రమీల పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: సీఐ

సి.బెళగల్, ఆగస్టు 22: మండలంలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని కోడుమూరు సీఐ తబ్రేజ్ హెచ్చరించారు. గురువారం సి.బెళగల్ పోలీసు స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ఏఎస్‌ఐ నాగయ్యతో మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో రౌడీ షీటర్లు ఎంతమంది ఉన్నారు, వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఐ వెంట ఏఎస్‌ఐ నాగయ్య, పోలీసులు ఉన్నారు.

నేడు సముద్రాల హనుమంతరావు సంస్మరణ సభ

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 22: కర్నూలుకు చెందిన దివంగత టీడీపీ నేత, రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమాఖ్య ఉపాధ్యక్షుడు సముద్రాల హనుమంతరావు సంస్మరణ సభ శుక్రవారం ఉదయం 11 గంటలకు నగరంలోని కోట్ల సర్కిల్ వద్ద నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ బ్రాహ్మణ సాధికారిక సమితి కర్నూలు పార్లమెంటరీ కన్వీనర్ టీవీ రవిచంద్ర శర్మ, సమితి నాయకులు ఆనందరావు, సీవీ దుర్గాప్రసాద్, కంచుగంటల శ్యామ్ సుందర్‌రావు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

కక్ష పూరిత కేసులను విచారించాలి



డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసిన నాయకులు

ఆదోని, ఆగస్టు 22: వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో కక్షపూరితంగా టీడీపీ శ్రేణులపై పెట్టిన కేసులను విచారించి తగు న్యాయం చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి కోరారు. గురువారం డీఐజీని కార్యాలయంలో డీఐజీ కోయ ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. వైసీపీ పాలనలో టీడీపీలోని యువత మీద పెట్టిన అక్రమ కేసులను విచారించి కేసులు పెట్ట డానికి సహకరించిన అధికారులను, అందుకు సహకరించిన నాయకులపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర సెక్రటరీ సురేష్ నాయుడు, ప్రతాప్ రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి



దేవనకొండ: విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

తుగ్గలి, ఆగస్టు 22: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం జొన్నగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని మెనూ ప్రకారం సక్రంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇన్‌టైమ్‌లో సిలబస్ పూర్తి చేసి రివిజన్ టెస్టు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపేంద్ర, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ నగేష్ ఉన్నారు.

దేవనకొండ: ఆత్మస్థైర్యంతో ఉండాలని డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం దేవనకొండలోని జడ్పీ పాఠశాల, కస్తూరిబా పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

జీవో 84, 117లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న జంగం బసవరాజు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 22: మున్సిపల్ ఉపాధ్యాయులకు మేలు చేయని జీవో 84, 117లను వెంటే రద్దు చేయాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేష న్ పట్టణ ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు డిమాండ్ చేశారు. గురువా రం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎంటీఎఫ్ ముఖ్య నాయకుల సమావే శం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల కిందట అప్ గ్రేడ్ అయిన మున్సిపల్ పాఠశాలలకు ఉన్నత పాఠశాలకు ఒక్క పోస్టు కూడా నేటికీ మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేసి తక్షణమే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఎఫ్ నాయకులు బడుగు బసపూరాజు, చంద్రశేఖర్, ప్రతాపరెడ్డి, ఆనంద్, దస్తగిరి, నూర్హులక్, రమేష్ రావు, చంద్రశేఖర్ శర్మ పాల్గొన్నారు.

కంప్యూటరీకరణతో ఇబ్బందులు

తుగ్గలి, ఆగస్టు 22: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ విధానంలో సమస్యలు పరిష్కరించాలని మారెల్ల, జొన్నగిరి సొసైటీ సీఈవోలు మనోహర్ నాయుడు, గిడ్డయ్యలు కోరారు. గురువారం మండలంలోని పెండేకల్ ఆర్ఎస్, జొన్నగిరిలో సొసైటీ కార్యాలయాల్లో సిబ్బంది కంప్యూటరీకరణ విధానంలో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ నల్లబ్యాడ్జీలతో ఆందోళనలు చేపట్టారు. సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ ద్వారా డిపాజిట్లు, భూమి సమాచారం, మెంబర్‌షిప్ పొందుపరిచే విధానంలో చాలా సమస్యలు ఉన్నాయని అన్నారు.

భూ దందాపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు అజయ్ బాబు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 22: గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ దందాలపై విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా ఐదేళ్ల వైసీపీ పాలనలో అమాయక ప్రజల సాగు భూములు, ఇళ్ల స్థలాలను దౌర్జనంగా ఆక్రమించుకున్నారన్నారు. బాధితులకు న్యాయం చేయాల్సిన అధికారులు చేతులెత్తేశారన్నారు. పలుమార్లు రెవెన్యూ అధికారులు చుట్టూ బాధితులు తిరిగినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. అన్యాక్రాంతమైన భూములను వారికే దక్కాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, కల్లుబావిరాజు, విజయ్ పాల్గొన్నారు.


గ్రామ సభలను విజయవంతం చేయండి

మద్దికెర, ఆగస్టు 22: ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామ సభల ను విజయవంతం చేయాలని ఎంపీడీవో నరసింహమూర్తి, ఏపీవో నర్సిరెడ్డి అన్నారు. గురువారం కార్యాలయంలో పీఏ, టీఏల సమావే శం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 8 గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామ సభలు నిర్వహించాలని అన్నారు. సచివాలయాల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తామని, రైతులకు ఈ సమాచారాన్ని అందించాలని కోరారు. వ్యవసాయ పనులు ప్రతి కూలికి కల్పించాలని కోరారు.


పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మద్దికెర, ఆగస్టు 22 : మండంలలోని శుక్రవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని పశువైద్యాధికారి కృష్ణ నాయక్ అన్నారు. గురువారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే పాలు దిగుబడి తగ్గి ఆ పాలు తాగిన దూడలు మరణించే అవకాశం ఉందని అన్నారు. పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించాలని కోరారు.

ఆదిమానవుడి ఆనవాళ్లు..!



ఇంకిపోని కోనేరు



శివలింగాకృతిలో భక్తులను ఆకర్షిస్తున్న కొండరాయి

● ధన గంగమ్మ ఆలయ ఆవరణలో నాటి గుర్తులు



ధన గంగమ్మ ఆలయం

బండరాయిపై ఆదిమానవుని రేఖా చిత్రాలు

ఆస్పరి, ఆగస్టు 22: మండలంలోని కల్లపరి గ్రామ సమీపంలో ఆదిమానవుల ఆనవాళ్లు నేటికీ కనిపిస్తున్నాయి. చుట్టూ పెద్ద పెద్ద కొండ లు... ఆ కొండలపైన ఆదిమానవుల నివాసాలు దర్శనమిస్తున్నాయి. ఆదిమానవుని సంచారాన్ని గుర్తుకు తెచ్చే ఈ కొండపై సుమారు పది గ్రామాల ప్రజల ఆరాధ్య దైవమైన ధన గంగ మ్మ అవ్వ ఆలయం ఉంది. ప్రతి ఏటా శ్రావణ మాసంలో ధన గంగమ్మ అవ్వకు ప్రత్యేక పూజ లు అభిషేకాలు, నిర్వహిస్తూ భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కొండ విశిష్టతను, ఆదిమానవుల సంచారాన్ని, అప్పటి నివాస ప్రదేశాన్ని చూసి ఆశ్చర్యానికి గురవుతు న్నారు. కొండపై నుంచి ఆదిమానవుడు సుమా రు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రదేశాన్ని సైతం కనిపెడుతూ జీవనం సాగించేవాడని ఇక్కడి గ్రామాల ప్రజలు చెబుతున్నారు. వేల సంవత్సరాల కిందట బండరాళ్లపై గీచిన రేఖా చిత్రాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. పెద్ద పెద్ద బండరాళ్లను ఆవాసాలుగా మార్చుకొని ఆదిమా నవుని జీవించినట్టు తెలుస్తోంది. వందల మీటర్ల ఎత్తులో ఉన్న కొండపై ధన గంగమ్మ ఆలయం లో ఎప్పటికీ నీరు ఇంకిపోని కోనేరు ఉండడం విశేషం. చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశ మి ఉత్సవాల్లో భాగంగా ధన గంగమ్మ ఆలయా నికి కర్ణాటక నుంచే కాక రాష్ట్రం నలువైపుల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో మూడో శుక్రవా రం సమీప గ్రామాల ప్రజలు ధన గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమెకు నైవేద్యంగా గోంగూర రొట్టెను సమర్పిస్తారు. రైతులు పరుగు పందెం తలపించేలా కొండెక్కి ఆలయ ప్రాంగ ణంలో వెలసిన కోనేటి నీటిని తెచ్చుకుంటారు. అనంతరం ఆ నీటిని తమ పొలాల్లో చల్లుకుం టారు. ఆ నీటిని తమ పొలాలలో చల్లుకుంటే అధిక దిగుబడులు వస్తాయని రైతుల నమ్మకం.

చందాలతో పొలాలకు రహదారి



రహదారిని బాగు చేయించుకుంటున్న రైతులు

మద్దికెర, ఆగస్టు 22: రైతులంతా చేయి చేయి కలిపారు. రూ.50 వేలకు పైగా చందాలు పోగు చేసి రహదారిని బాగు చేసుకున్నారు. మద్దికెర నుంచి రంగమ్మ కుంట, మంచర్ల మీదుగా పొలాలకు వెళ్లే రహదారి నడవడానికి సైతం వీల్లేకుండా ముళ్ల కంపలతో మూసుకుపోయింది. బాగు చేయించాలని అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించు కోలేదు. దీంతో రైతులంతా చందాలు వేసుకొని రూ.50 వేలకు పైగా నగదు పోగు చేసుకున్నారు. ఎక్స్‌వేటర్ ద్వారా ముళ్లకంపలు తొలగించు కోవడమే కాకుండా వర్షం నీరు బయటకు వెళ్లేందుకు కాలువను తయారు చేసుకున్నారు. ఉపాధి కింద నిధులు రూ.15 లక్షలు మంజూరు చేస్తే పంట పొలాలకు వెళ్లే రహదారి మరింత మెరుగు పడుతుందని రైతులు జయరామిరాజు, మల్లికార్జున యాదవ్, సుధాకర్, గోపాల్, మల్లయ్య అన్నారు.

పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలి

మద్దికెర: చిన్నపాటి వర్షం వస్తే రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని రైతులు గుంతకల్లు అసిస్టెంట్ డీఆర్ఎంకు వివరించారు. గురువా రం మద్దికెరలోని మల్లప్పస్వామి దేవాలయం పక్కగల రైల్వే అండర్ బ్రిడ్జిలో వర్షం నీరు నిలిచిపోయిందని, ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం సాయంత్రం అసిస్టెంట్ డీఆర్ఎం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో తమ పొలాలకు వెళ్లేందుకు ఎంతో అనువుగా ఉండేదన్నారు. కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్ల రైల్వే అండర్‌బ్రిడ్జి పూర్తిగా కిందికి తవ్వడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. వర్షాకాలం వస్తే చాలు వెళ్లలేకపోతున్నామన్నారు. గతంలో ఈ వర్షం నీటిలో వెళ్లి రెండు వృషభాలు కూడా మరణించాయని గుర్తు చేశారు. నీరు తవ్వేందుకు పక్కన కాల్వ వేయాలని కోరారు. అసిస్టెంట్ డీఆర్ఎం మాట్లాడుతూ సమస్యనుపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జి బాధ్యతల స్వీకరణ

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 22: ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జిగా హేమ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురురాజారావు, రఘురామ్‌లతోపాటు మరికొంత మంది న్యాయవాదులు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

ఎమ్మిగనూరులో 33.8 మి.మీ. వర్షం

ఎమ్మిగనూరు, ఆగస్టు 22: ఎమ్మిగనూరు పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం 33.8 మి.మీ. వర్ష పాతం నమోదైంది. దీంతో పట్టణంలోని రహదారులు జలమయం కాగా పంట పొలాల్లో వర్షం నీరు చేరి నిలిచింది. పత్తి, ఉల్లి, వేరుశనగ, కంది తదితర పంటల్లో వర్షం నీరు నిలిచి కనిపించింది. అక్కడఅక్కడా పత్తి పైరుకు తండి ఎక్కువ కావటంతో ఎర్రబారటం కనిపించింది.

సమస్యలు పరిష్కరించండి: సీపీఎం

నందవరం, ఆగస్టు 22: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా జిల్లా నాయకులు గురుశేఖర్ అన్నారు. గురువారం నాగలదిన్నె గ్రామంలోని యువర్స్ కాలనీలో వారు పర్యటించారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా రోడ్ల పరిస్థితి మాత్రం మారడం లేదన్నారు. వర్షం పడితే చాలు వీధులన్ని జలమయం అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.10 వేల విరాళం

పత్తికొండ టౌన్, ఆగస్టు 22: వయనాడ్ వరద బాధితులకు మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకుడు రూ.10వేలు విరాళం ఇచ్చాడురు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పత్తికొండ మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డిలు సీపీఐ మండల నాయకులు రాజాసాహెబ్‌కు నగదును అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పత్తికొండ ప్రభుత్వాసుపత్రి వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



ఆదోనిలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ



మొక్కలు నాటుతున్న వీరభద్ర గౌడ్ తదితరులు

పత్తికొండ, ఆగస్టు 22: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, లోక్‌నాథ్, పుండుకూర బ్రహ్మయ్య, తిక్క రమేష్, ఏపీడీ పకీరప్ప, ఏపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆదోని: ఆదోని మండలం మండగిరి గ్రామ పంచాయతీలో ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పీడీ లోకేష్, ఏపీవో కాలిక్, టెక్నికల్ అసిస్టెంట్ ఆనంద్, మాజీ కౌన్సిలర్ మారుతి పాల్గొన్నారు.

ఆలూరు: ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1లో ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో అల్లా బకాష్, నారాయణ, గుండన్న, రమేష్ పాల్గొన్నారు. అలాగే గ్రామాల్లో చెప్పాల్సిన అభివృద్ధి పనులపై సర్పంచ్, ఎంపీటీసీలు, కూటమి నాయకులు కలసి చర్చించి గ్రామ సభల్లో తీర్మానం చేయాలని వీరభద్ర గౌడ్ కోరారు.

ఆస్పరి: మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో పాఠశాల చైర్మన్ తాయన్న, టీడీపీ మాజీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సంజప్ప మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణమ్మ, ఉపాధ్యాయురాలు విజయ్ కుమారి, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మొలగవల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మొలగవల్లి సర్పంచు మోహన్ రాజ్, టీడీపీ మండల కన్వీనర్ అశోక్ యాదవ్, టీడీపీ నాయకులు వెంకటేశ్వరులు, రామంజినేయులు, బెలగంటీ హనుమప్పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోక మల్లయ్య, ఈరన్న, యంకన్న, టెక్నికల్ అసిస్టెంట్ ఈరన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్ల పంచాయతీ కార్యాలయం దగ్గర సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ మొక్కలు నాటారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు.

తుగ్గలి: మండలంలోని రాంపల్లి, బొందిమడుగుల తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాయలసీమ జనార్దన్, రాంపల్లి శ్రీనివాసు లు, హేమాద్రి నాయుడు మసాలా శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేవనకొండ: ఎంపీడీవో కార్యాలయం, తెర్నేకల్ పంచాయతీ ఎంపీడీవో గౌరీదేవి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ, ఏవో ఇద్రుస్‌బాషా, సర్పంచు ఆరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: చక్రాళ్ల పాఠశాలలో ఎంపీటీసీ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తిమ్మరాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: పెద్దకడుబూరులోని మోడల్ స్కూల్ ఆవరణలో టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి మొక్క నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగన్న, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ ఖాదర్‌బాషా, టీడీపీ నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు.

ఆదోని రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో దాదాపు గురువారం 400 మొక్కలను నాటినట్లు ఎంపీడీవో గీతావాణి తెలిపారు. మొక్కలు నాటి సంరక్షించాలని ఆమె పిలుపునిచ్చారు.

సాంకేతిక విద్యపై దృష్టి సారించాలి



కళాశాలలో మాట్లాడుతున్న న్యాక్ పీర్ టీం చైర్మన్ గోపాల్ కుమార్ నిరోలా చెట్టి

ఎమ్మిగనూరు, ఆగస్టు 22: విద్యార్థులు సాంకేతిక విద్యపై దృష్టి సారించి తద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని న్యాక్ పీర్ టీం చైర్మన్ గోపాల్ కుమార్ నిరోలా చెట్టి అన్నారు. న్యాక్ పీర్ టీం రెండో రోజు పర్యటనలో భాగంగా కళాశాలలో ఉన్న వివిధ విభాగాలు, ల్యాబ్‌లను పరిశీలించి అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వసతులు ఉన్నాయని, మంచి అనుభవం ఉన్న అధ్యాపక బృందం ఉందని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. కళాశాలలో ఉన్న గ్రీనరీ, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ఇతర విభాగాలను చూసిన వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. మహబూబ్ బాషా, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల నమోదు చేపట్టాలి



ఈక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

మద్దికెర, ఆగస్టు 22: మండలంలోని రైతులు సాగు చేసిన పంటల నమోదు కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లుకు తావు లేకుండా పంటల నమోదు చేయాలని వ్యవసాయ శాఖ మండల అధికారి ఉప్పర రవి అన్నారు. గురువారం మండలంలోని ఎం.అగ్రహారం, మద్దికెర గ్రామాల్లో జరుగుతున్న ఈక్రాప్ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేర్‌తో కూడిన బృందాలు పంట పొలాలను సందర్శించి ఈ పంట నమోదు చేయాలన్నారు. ఈ పంట నమోదు చేసుకోకపోతే రైతులు నష్టపోతారని తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 22: భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, రైతు సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు కారన్న, అధ్యక్షుడు వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయ అధికారులకు సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రబీ కింద పంటలు సాగు చేసుకునేందుకు రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులను అందజేయాలన్నారు. బ్యాంకు రుణాలను మాఫీ చేసి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ప్రజా సంఘాల నాయకులు రామాంజనేయులు, నెట్టికంటయ్య, నరసింహులు, మాదన్న పాల్గొన్నారు.

పంచాయతీలకు మహర్దశ

తుగ్గలి, ఆగస్టు 22: పంచాయతీలకు నిధులు మంజూరు చేయడంతో గ్రామాలకు మహర్దశ వచ్చిందని టీడీపీ సీనియర్ నాయకుడు అప్పా వేణుగోపాల్ అన్నారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉప్పర్లపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థలకు టీడీపీ అధికారంలోకి రాగానే రూ.1400 కోట్లకు పైగా స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు పీఎఫ్ అమలు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 22 : ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడులు డిమాండ్ చేశారు. గురువారం పాత మునిసిపల్ స్టేడియంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆటో కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. 50 ఏళ్ల వారికి పెన్షన్, వాహన మిత్ర తదితర స్కీంలు అమలు చేయాలని కోరారు. అనంతరం సీఐటీయూ అధ్యక్షుడిగా బి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ హుసేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నరసింహులు, రాజు, కేశన్న, బాషా తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు బానిసలు కావొద్దు

ఆలూరు, ఆగస్టు 22: చెడు అలవాట్లకు బానిసలు కావద్దని ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, ఎస్సై సీవీ నరసింహులు అన్నారు. గురు వారం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలు, సైబర్ నేరలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సైబర్ వలలో పడవద్దని సూచించారు. కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే సమాచారం ఇవ్వాలని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేంజుండప్ప ఉన్నారు.

మహా రథోత్సవానికి భారీ బందోబస్తు



బందోబస్తులో పాల్గొన్న పోలీసులు



రథోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకుడు రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, ఆగస్టు 22: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్స వాల్లో భాగంగా గురువారం మహారథోత్సవం వైభవంగా సాగింది. ఎమ్మిగనూరు డీఎస్పీ సోమన్న, మంత్రాలయం సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు గోపినాథ్, విజయకుమార్, కృష్ణమూర్తి, వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో 325 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. యోగీంద్ర కళామండపంలో గురువారం రాత్రి బెంగుళూరు చెందిన ప్రభాత్ కళా విదరు వారిచే నృత్యనూపకం, ధారవాడకు చెందిన పండిత్ వెంకటేశ్ కుమార్ చే హిందుస్థాని వోకల్ సంగీతం భక్తులను అలరించింది. వేడుకల్లో డీఎస్పీ సోమన్న, టీడీపీ నియోజకవర్గ నాయకులు రాఘవేంద్రరెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, పూజారి వ్యాసరాజాచార్, గోపాలకృష్ణ స్వామి, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, రాకేశ్ రెడ్డి, విజయరామిరెడ్డి, పవన్ కుమార్, నక్కి వెంకటేశ్, అశోక్‌రెడ్డి, వరదరాజులు పాల్గొన్నారు.